వ్యవసాయ చెరువులకు జల కళ

- నిండుకుండలా దర్శనమిస్తున్న మైనర్ ఇరిగేషన్ చెరువులు
- భారీ వర్షాలతో భూగర్భ జలాలు వృద్ధి
- మెట్టప్రాంతంలో సాగుకు అనుకూలం


నల్లమాడు పంచాయతీలో జలకళను సంతరించుకున్న మైనర్ ఇరిగేషన్ చెరువు


నిండుకుండలా ఉన్న నాచుగుంట పట్టిమ్మ చెరువు

ఉంగుటూరు : మెట్ట ప్రాంతంలోని చెరువులు జలకళను సంతరించుకున్నాయి. మెట్టప్రాంతంలో బోర్లు లేకుండా కేవలం వర్షధారంతో నాట్లు వేసే రైతులకు ఈ ఏడాది కురిసిన వర్షాలు ఎంతో ఉపయోగపడ్డాయి. భూగర్భ జలాలు అడుగంటిపోయి ఇబ్బందులు పడే రైతులకు భారీ వర్షాలతో ఎంతో మేలు చేకూరింది. ప్రధానంగా మెట్ట ప్రాంతంలో గ్రామాలను ఆనుకుని ఉన్న చెరువులు వర్షం నీటితో నిండిపోయాయి. గట్లు తెగిపోయేలా కొన్ని చెరువులు పొంగి పొర్లుతున్నాయి.

మెట్ట ప్రాంతంలో వెల్లమిల్లి ఆయకట్టులో విస్తరించి ఉన్న పెళ్లికొడుకు చెరువు, అంతేడి చెరువు, మాదిగవాని గుంట, కొత్తచెరువు, బొడ్డువాని కర్ర, మంగలి కర్ర, చిన్న కుమ్మరి చెరువు, పెద్దకుమ్మరి చెరువు, భీముని చెరువు, చింతపల్లి చెరువు, వెంకటేశ్వరకర్ర, వీరభద్రుని చెరువు వర్షం నీటితో నిండిపోయాయి. నాచుగుంట పంచాయతీలో మంచినీటి చెరువు, పట్టిమ్మచెరువు, యర్రమళ్ల యర్రచెరువు, గుళ్లపాడులో రెండు చెరువులు, నీలాద్రిపురంలో రెండుచెరువులు, గోపినాథపట్నంలో పెద్ద చెరువులు రెండు, నల్లమాడు ఆయకట్టులో నల్లమాడుచెరువు, సుద్దగుంట, బ్రాహ్మణగుంట, మెరుసు గుంట, యర్రమిల్లిపాడులోని పెద్దచెరువు, ఊరచెరువు, రామచంద్రపురం ఆయకట్టులో మొగలి చెరువు, చిట్టిమ్మచెరువు, గోపాలపురం ఆయకట్టులో చందమామ గుంట, కేతని చెరువు, గొల్లగుడెం ఆయకట్టులో ధర్మచెరువు, ఊరచెరువు, భీముడు చెరువు, ఎ.గోకవరంలోని పెద్ద చెరువు ఊర చెరువు, తిమ్మయ్యపాలెం చెరువు జలకళతో నిండుగా దర్శనమిస్తున్నాయి. నిండుకుండల్లా ఉన్న ఈ చెరువుల నీటితో మెట్ట ప్రాంత పంట పొలాల్లో పంటల సాగుకు నీటి కరువు ఉండదని రైతులు భావిస్తున్నారు. పశువులకు నీటి కొరత ఉండదని పాడి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నెలరోజుల్లో 438.84 మిల్లీమీటర్ల వర్షం

రికార్డు స్థాయిలో జూలై నెలలో 438.84 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. ఉంగుటూరు మండలంలో నమోదైన ఈ వర్షంతో పాటు మెట్ట ప్రాంతంలోని ద్వారకాతిరుమల మండలం, నల్లజర్ల మండలంలోని వాగులు, వంకల వరద నీరు చేరి ఉంగుటూరు మండలంలో విస్తరించి ఉన్న సుమారు 38 మైనర్ ఇరిగేషన్ చెరువుల నిండిపోవడంతో జలకళ సంతరించుకున్నాయి.

వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అండగా ఉంటాం


కొండలరావుపాలెంలో నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. శనివారం కొండలరావుపాలెం మాజీ ఎమ్మెల్యే ఏలూరులోని క్యాంపు కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. ఇటీవల జరిగిన సంఘటనలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పార్టీ నాయకులు, శ్రేణులకు, బాధితులకు వ్యక్తిగతంగా తాను, పార్టీపరంగా అండగా ఉంటామన్నారు. పార్టీ శ్రేణులందరూ ధైర్యంగా ఉండాలని సూచించారు. బెదిరింపులకు తలొగ్గే ప్రసక్తే లేదని మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి అన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు


పోతునూరు పాఠశాలలో కంటి వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

దెందులూరు : విద్యార్థులందరూ కంటి వైద్య పరీక్షలు చేయించుకుని కంటి లోపాలను నివారించుకోవాలని పోతునూరు సర్పంచ్ బోదుల స్వరూప్ అన్నారు. శనివారం పోతునూరు ఉన్నత పాఠశాలలో పోతునూరు పీహెచ్‌సీ పారా మెడికల్ ఆప్తమాలజీ ఆఫీసర్ ఎం.దివ్య విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. దృష్టి లోపం ఉన్నవారికి కళ్లజోళ్లకు సిఫార్సు చేశారు. కంటికి వచ్చే లోపాలను, విటమిన్-ఏ ద్వారా వచ్చే లోపాలను విద్యార్థులకు వివరించారు. ఫిజికల్ డైరెక్టర్ ఎం.కృష్ణారావు, పాఠశాల ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది ఉన్నారు.

పారిశుధ్య పరిరక్షణకు చర్యలు


పోతునూరులో పారిశుధ్య పనులు చేస్తున్న సిబ్బంది

దెందులూరు : పోతునూరు పంచాయతీ పరిధిలోని పారిశుధ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్టు పోతునూరు సర్పంచ్ బోదుల స్వరూప్ అన్నారు. శనివారం పోతునూరు పంచాయతీ కార్యదర్శి షఫీ సర్పంచ్ ఆధ్వర్యంలో మురుగునీరు నిల్వలేకుండా చేసి బ్లీచింగ్‌ను చల్లించారు. గ్రామస్తులకు దోమల నివారణపై అవగాహన కల్పించారు. ఆశా, వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక రుగ్మతలపై అవగాహన అవసరం


పిప్పర పీహెచ్‌సీలో మాట్లాడుతున్న వైద్యాధికారి శంకర్‌రెడ్డి

గణపవరం: మానసిక సమస్యలపై నిర్లక్ష్యం తగదని, తగిన వైద్య సలహాలు తప్పనిసరిగా తీసుకోవాలని వైద్యనిపుణుడు శంకర్‌రెడ్డి అన్నారు. శనివారం గణపవరం మండలం పిప్పర పీహెచ్‌సీలో మానసిక సమస్యలు, ఆటిజం, డిప్రెషన్ సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక సమస్యలున్న వారు తప్పనిసరిగా వైద్యులను సంప్రదించి తగిన వైద్య సలహాలు, సూచనలు తీసుకోవాలని అన్నారు. పీహెచ్‌సీలో ప్రతినెలా ఉచితంగా వైద్య సలహాలు, అవసరమైన మందులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి కె.ప్రియాంక, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కొండయ్య మృతికి సంతాపం


వెంకట్రాజపురంలో కొండయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వాసుబాబు

గణపవరం : గణపవరం మండలం వెంకట్రాజపురం గ్రామానికి చెందిన సీనియర్ వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఆండ్రు కొండయ్య ఇటీవల ఆకస్మికంగా మృతి చెందారు. శనివారం మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, పార్టీ నాయకులు కొండయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లంపల్లి సురేష్, పార్టీ మండల కన్వీనర్ దండు రాము, నాయకులు ఐఎస్ఎన్ రాజు, కర్రి శ్రీనివాసరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి కృషి


ఉంగుటూరులో విద్యాశాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు: ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి తన వంతు కృషి చేస్తానని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో విద్యాశాఖ అధికారుల నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో మెనూ అమలుపై సమీక్షించారు. ఈ సమావేశంలో డీవై ఈవో రవీంద్రభారతి నాలుగు మండలాల అధికార్లు పాల్గొన్నారు.

మానవత సేవలు అభినందనీయం


03డిజిఎన్‌పి03 వికలాంగులకు ట్రైసైకిల్ అందచేస్తున్న మానవత సభ్యులు

గణపవరం: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అనతికాలంలోనే అగ్రగామి సేవాసంస్థగా అవతరించిందని పలువురు అన్నారు. శనివారం గణపవరంలో వికాలాంగులకు ఉండి మండల మానవత సంస్థ సభ్యులు ఆర్థిక సహకారంతో పేరాబత్తుల బలరాముడుకు ట్రై సైకిల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవత రీజియన్ ఛైర్మన్ కాకర్ల వినాయక, సభ్యులు యువరాజు, బి.శ్రీనివాస రావు, వంకాయల రామారావు, కెజగపతిరాజు, పెరుమాళ్ల ఆంజనేయులు, వికలాంగ మహా సంఘటన్ జిల్లా కార్యదర్శి క్రొవ్విడి ఉదయశంకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్‌పాస్‌ల పంపిణీ


గణపవరం హైస్కూల్లో ఉచిత బస్‌పాస్‌లు అందిస్తున్న దాతలు, అధికారులు

గణపవరం: విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని గణపవరం ఎంఈవో పుచ్చల శేషు, తాడేపల్లిగూడెం ఆర్టీసీ డీఎం సత్యనారాయణ మూర్తి అన్నారు. శనివారం గణపవరం బాలురు, బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఇతర గ్రామాలకు చెందిన విద్యార్థులకు దాతల ఆర్థిక సహకారంతో ఉచిత బస్‌పాస్‌లను అందజేశారు. బాలికల ఉన్నత పాఠశాలలో 150 మంది విద్యార్థులకు బస్‌పాస్‌లను కూసంపూడి సురేంద్రకుమార్ రాజు, బాలుర ఉన్నత పాఠశాలలో 130 మంది విద్యార్థులకు మానవత డైరెక్టర్ బొడ్డు శ్రీనివాస రావు ఆర్థిక సహకారం అందజేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు తమ అభిరుచులు మార్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు మూర్తి, బాలభాస్కరరావు, మండల తెదేపా అధ్యక్షుడు ఐ.రామకృష్ణంరాజు ఆర్టీసీ పీఆర్వో విజయకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాతలను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి, జ్ఞాపిక అందజేశారు.

విద్యాలయాలు విద్యార్థుల మనోవికాస కేంద్రాలు


భీమడోలులో విద్యా సంస్థ వార్షికోత్సవ సభలో మాట్లాడుతున్న సీఐ బీబీ రవికుమార్

భీమడోలు: విద్యాలయాలు విద్యార్థుల మనోవికాస కేంద్రాలని భీమడోలు సీఐ బీబీ రవికుమార్ అన్నారు. భీమడోలులో మాంటిస్సోరి విద్యా సంస్థల ఆధ్వర్యంలో శనివారం ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి విద్యాసంస్థల అధినేత కె.ప్రేమ్‌కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా సీఐ బీబీ రవికుమార్ హాజరయ్యారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను అందించారు. జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, భీమడోలు ఫైర్ అధికారి నాగరాజు, సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్, మాజీ జెడ్పీటీసీ కరణం పెద్దిరాజు, మాజీ ఏఎంసీ ఛైర్మన్ దూసనపూడి పుల్లయ్య, సొసైటీ మాజీ ఛైర్మన్ గన్ని గోపాలరావు, పెద్దలు ప్రత్తి మదన్, ఈతకోట సుబ్బారావు, పైడిమాల యుగంధర్, కళాశాల ప్రిన్సిపల్స్ బాలు, అశోక్, కేసరి పాల్గొన్నారు.

స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులు మంజూరు చేయాలి


మాట్లాడుతున్న అధ్యక్షుడు కురమా ఆనంద్‌కుమార్

ఏలూరు(ఆర్‌ఆర్‌పేట): ఏటా రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ స్కూళ్లల్లో స్పెషల్ ఎడ్యుకేషన్ చేసిన వారికి ఎస్‌ఏ స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులు మంజూరు చేయాలని ఏపీటీఎఫ్ నగర శాఖ అధ్యక్షుడు కురమా ఆనంద్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం స్థానిక తూర్పువీధి నగరపాలక ఉన్నత పాఠశాలలో ఏపీటీఎఫ్ నగర శాఖ సమావేశం నిర్వహించారు. సంఘ ఉపాధ్యక్షుడు మేరుగు విలియం బెనర్జీ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ అప్పర్ ప్రైమరీ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు చేయాలని కోరారు. జిల్లా కౌన్సిలర్ వీవీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జీఓ-84, 117ను రద్దు చేయాలని కోరారు. మరో జిల్లా కౌన్సిలర్ డి.కేదారేశ్వరస్వామి మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయుల పీఎఫ్ ఖాతాల నుంచి ప్రస్తుత జీపీఎఫ్ ఖాతాల్లోకి నగదు మార్చాలని కోరారు. ఉపాధ్యక్షుడు ఎం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సర్దుబాటు సాధ్యమైనంత త్వరితగతిన మండల పరిధిలోనే పారదర్శకంగా నిర్వహించాలన్నారు. జిల్లా కౌన్సిలర్ కె.కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులకు స్పౌజ్, మ్యూచ్యువల్ వారికి అంతర్ జిల్లాల బదిలీలు, ఉపాధ్యాయులకు సాధారణ బదిలీలు నిర్వహించాలని కోరారు. ప్రధాన కార్యదర్శి అబ్బదాసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలని, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు ఎంఎస్ఎన్ మూర్తి, చింతా వెంకటరత్నం, ఎ.సాంబమూర్తి, ఎ.జోజిబాబు, జి.రాజారావు, తొమ్మండ్రు ప్రకాష్, ఎస్ఎస్ ప్రతాప్, జె.శాంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్రెండ్‌షిప్ డే వేడుకలు

దెందులూరు: దెందులూరు బీఆర్‌డీ నర్సింగ్ కళాశాలలో శనివారం ఫ్రెండ్‌షిప్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీనియర్, జూనియర్ నర్సింగ్ విద్యార్థులు ఒకరికొకరు ఫ్రెండ్ షిప్ బ్యాండ్లను కట్టి స్వీట్లు పంచుకున్నారు. కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు, అధ్యాపకులు ఫ్రెండ్‌షిప్ డే ప్రత్యేకతను వివరించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

తల్లిపాలు అమృత తుల్యం


ఉంగుటూరు : రామచంద్రపురంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

దెందులూరు: ప్రతి బాలింత తప్పనిసరిగా బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు అందించాలని, తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కేవీఎల్ఎన్ పద్మావతి అన్నారు. శనివారం మండలంలోని పోతునూరులోని పాఠశాలలో శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని పెదపాడు ప్రాజెక్టు సీడీపీఓ విజయలక్ష్మి, అడిషనల్ సీడీపీఓ రాజశేఖర్, పోతునూరు సెక్టర్ సూపర్‌వైజర్ శ్రీదేవి ఆధ్వర్యంలో పోతునూరు సర్పంచ్ బోదుల స్వరూప్ అధ్యక్షతన తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోతునూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ చైతన్య ఆరోగ్య వైద్య సిబ్బంది అరుంధతి దేవి, పద్మావతి, ఏఎన్ఎంలు అరుణ కుమారి, రత్న కుమారి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు, అనంతరం తల్లిపాల వారోత్సవాల వాల్‌పోస్టర్‌ను ప్రదర్శించారు.

తల్లిపాలు పిల్లలకు సంపూర్ణ ఆహారం

ఉంగుటూరు : తల్లిపాలు పిల్లలకు సంపూర్ణ ఆహారమని భీమడోలు సీడీపీఓ విజయలక్ష్మి అన్నారు. శనివారం ఉంగుటూరు మండలం రామచంద్రపురం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ తల్లిపాలల్లో బిడ్డకు అవసరమైన అన్ని పోషకాలు ఉంటాయని, వ్యాధి నిరోధక శక్తి కలుగుతుందని అన్నారు. చేబ్రోలు సెక్టారు సూపర్ వైజరు శారద, అంగన్‌వాడీ కార్యకర్తలు సుజాత, సహాయకురాలు శృతి పాల్గొన్నారు. వట్లూరులోని శౌరి పురంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కె కుమారి, సెక్టారు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


గణపవరం : పిప్పరలో తల్లులకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

తల్లిపాల ప్రాముఖ్యతను గుర్తించాలి

గణపవరం: బిడ్డలకు అమృత సమానమైన తల్లిపాల ప్రాముఖ్యతను ప్రతి తల్లీ గుర్తించాలని గణపవరం మండలం పిప్పర ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దుర్గాభవాని అన్నారు. శనివారం గణపవరం మండలం ముప్పర్తిపాడులో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ కర్రి రాధాలక్ష్మి మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డలకు జీవితాంతం రక్షణ కవచంలా ఉండి వ్యాధులు దరిచేరకుండా కాపాడతాయన్నారు.

నిడమర్రు మండలంలో..

నిడమర్రు మండలం బువ్వనపల్లి ఫ్రీహైస్కూలు ఆవరణలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు వాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా కంచి కామాక్షికి ఆషాఢ సారె


గణపవరంలో కంచి కామాక్షి అమ్మవారికి సారె సమర్పించిన భక్తులు

గణపవరం: గణపవరం బాలయ్య చెరువువద్ద ఉన్న శ్రీ కంచికామాక్షి కనకదుర్గ అమ్మవారికి భక్తులు ఆషాఢ సారెను సమర్పించారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అమ్మవారికి రకరకాల కూరగాయలతో శాకంబరీగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో మహిళలు అమ్మవారికి సారెను సమర్పించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ తెలగారెడ్డి బాబీ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ముత్యాలమ్మకు ఆషాఢ సారె సమర్పణ

ఉంగుటూరు : ఉంగుటూరు మండలం ఉప్పాకపాడు రేవు వద్ద ఉన్న ముత్యాలమ్మతల్లికి పత్సమట్ల ధర్మరాజు సారెను శనివారం సమర్పించారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు ఈయన ఈ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

10 నుంచి మహిళలకు ఉచిత శిక్షణ

భీమడోలు: సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీ నుంచి భీమడోలులోని మహిళలకు మగ్గం, జర్దోసి వర్క్‌పై ఉచిత శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థల భీమడోలు ఛైర్మన్ వర్ధినీడి సత్యసాయి శనివారం తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన బ్యాంకర్ల గ్రామీణ, ఔత్సాహికుల అభివృద్ధి సంస్థ సహకారంతో సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ మహిళలకు ఉచిత శిక్షణ అందిస్తున్నామన్నారు. 10వ తరగతి చదివిన 19 ఏళ్ల నుంచి 35 ఏళ్ల లోపు మహిళలు శిక్షణకు అర్హులన్నారు. ప్రతిరోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటలకు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ తరుణంలో ఉచితంగా భోజన వసతి ఉంటుందని తెలిపారు. ఆసక్తికలగిన వారు తమ పేర్లను భీమడోలులోని కార్యాలయంలో నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

బార్ అసోసియేషన్ సెక్రటరీగా రాముడు


సెక్రటరీ రాముడును సత్కరిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

దెందులూరు: గోపన్నపాలెం గ్రామానికి చెందిన న్యాయవాది నోముల రాముడు ఏలూరు బార్ అసోసియేషన్ కార్యదర్శిగా విజయం సాధించారు. ఆయన్ని ఏలూరు బార్ అసోసియేసన్ సభ్యులు, న్యాయవాదులు పి.డానియేల్, పి.రత్నరాజు, ఎం.గోపాలరావు సత్కరించారు. ఏలూరు బార్ అసోసియేషన్ అభివృద్ధికి, బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని రాముడు అన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

ఉంగుటూరు: లంబాడి గుడం గ్రామానికి చెందిన వివాహిత బానోతు రాణి ఈనెల 1వ తేదీ నుంచి కనిపించడం లేదని ఆమె భర్త పండు శనివారం చేబ్రోలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై మణికుమార్‌కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొల్లేరుకు కొనసాగుతున్న వరద


ఏలూరు పడమట లాకుల వద్ద వరద ప్రవాహం

ఏలూరు రూరల్ : కొల్లేరులోకి వరదనీటి ప్రవాహం కొనసాగుతోంది. శనివారం సైతం తూర్పు, పడమట లాకుల మీదగా వందల క్యూసెక్కుల నీరు కొల్లేరు సరస్సుకు చేరుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఎగువ ప్రాంతం నుంచి వరదనీరు పెద్ద ఎత్తున తమ్మిలేరు గుండా ఏలూరుకు చేరుతోంది. దీన్ని గుర్తించిన ఇరిగేషన్ అధికారులు లాకుల గేట్లు మరింత ఎత్తుకు పెంచి మరింత నీటిని విడుదల చేస్తున్నారు. ఈ ఏడాది జూలై నెల ఆఖరి వారంలో తమ్మిలేరుకు రెండు రోజులు వరద నీరు పారింది. మళ్లీ వారం రోజులు కాక ముందే బుధవారం నుంచి మరోసారి వరదనీరు ప్రవాహం ప్రారంభమైంది. నాలుగురోజుల పాటు పారుతున్న వరద నీటితో కొల్లేరుకు జలకళ వచ్చింది.

స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు
త్రివేణి ప్రసాద్ స్టడీ సర్కిల్
ఫైర్ ఆఫీస్ ఎదురురోడ్, N.R. పేట, ఏలూరు
TET/DSC లాంగ్‌టర్మ్ | Gropu-I,II,III, IV
కానిస్టేబుల్స్/ SI | RRB | BANKS | SSC
అడ్మిషన్లు జరుగుచున్నవి
మూడు క్లాసులు విని నిర్ణయం తీసుకోవలెను.
అన్ని పోటీ పరీక్షలకు కోచింగ్ ఇవ్వబడును.
Ph:93476 57730, 91826 89695, 98665 82838

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
దెందులూరు, ఉంగుటూరు
99122 20559
90102 23729
Office mail : tpgadvt@gmail.com